క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మందస: రైతులు, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, జిల్లా కమిటీ నాయకులు గొరకల బాలకృష్ణ కోరారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏటా అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు పంటలను నష్టపోతున్నారన్నారు. ఈ పరిస్థితులపై నిపుణులతో ముందుగానే అంచనా వేయాలన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

వాహనాల తనిఖీలు


సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

టెక్కలి రూరల్: టెక్కలిలో వాహనాల తనిఖీలను పోలీసులు ఆదివారం చేపట్టారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆదేశాల మేరకు టెక్కలి సర్కిల్ పరిధిలోని టెక్కలి, కోటబొమ్మాళి, నౌపడ, సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్ల సిబ్బంది ఉదయాన్నే చేరుకొని టెక్కలిలోని ఇందిరాగాంధీ జంక్షన్, రావివలస జంక్షన్, అంబేడ్కర్ కూడలి, మెళియాపుట్టి జంక్షన్లలో వాహనాల తనిఖీలు చేపట్టారు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని అతివేగంగా వెళ్లే వాహనాలను, ట్రిపుల్, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని తనిఖీలు చేపట్టారు. 26 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నంబర్ ప్లేట్‌లు లేని రెండు ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు టెక్కలి ఎస్సై ఎల్.రామకృష్ణ తెలిపారు.

గణిత ప్రతిభా పరీక్షకు స్పందన


విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. మొత్తం 50 మంది విద్యార్థులు హాజరై ప్రతిభను నిరూపించారు. అనంతరం జిల్లాకు ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నరేష్, స్వర్ణలత, రుషి, శ్రీను, తాతారావు, విమలాదిత్య, త్రినాథరావు, సూర్యనారాయణ, భాస్కరరావు, విజయ్‌కుమార్, మురళికృష్ణ పాల్గొన్నారు.

ఆలయానికి దుర్గాదేవి చిత్రపటం బహూకరణ


దాతలు అందజేసిన దుర్గాదేవి చిత్రపటం

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారికి కవిటికొత్తూరుకు చెందిన దున్న లోకనాథం, పార్వతి దంపతులు రూ.35 వేల విలువైన దుర్గాదేవి చిత్రపటాన్ని బహూకరించారు. గుడికి వచ్చే ముఖద్వారానికి ఎదురుగా భక్తులకు అమ్మదర్శనం కలగాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు దాతలు తెలిపారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి


రామారావు (ఫైల్)

కోటబొమ్మాళి: కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ దుబ్బ రామారావు (36) రాజస్థాన్‌లో అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు తెలిపిన వివరాల ప్రకారం.. రామారావు కొంతకాలంగా రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై రాజస్థాన్‌లోని ఉదయపూర్ జీబీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్టు సంబంధిత అధికారుల నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చిందన్నారు. మృతునికి భార్య దివ్య భారతి, కుమార్తెలు లేఖ్య, హర్షిణీశ్రీలు ఉన్నారు. రామారావు మృతితో గ్రామంలో విషాదం నెలకుంది. మృతదేహాన్ని సోమవారం నాటికి కొత్తపల్లికి తీసురానున్నారు. బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి సమాచారం తమకు అందిందని.. సోమవారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని స్థానిక ఎస్సై షేక్ మహ్మద్ అలి తెలిపారు.

సంబరం


ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాలతో పాటు ఒడిశాలోని సుమండీ, సామంతపల్లి, పాత్రపురం, రొంపా గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు మేళతాళాలు, కోయ నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఘనంగా ఊరేగించి, మొక్కుబడులు తీర్చుకున్నారు.

-ఇచ్ఛాపురం రూరల్

సండే సందడి


కార్తీక మాసం చివరి దశకు చేరుకుంది. దీంతో పిక్నిక్‌లు జోరుగా జరుగుతున్నాయి. ఆదివారం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు స్వర్ణాపురం బీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు, విద్యార్థులు సముద్ర తీరంలో ఉల్లాసంగా గడిపారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒడిశా పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

-ఇచ్ఛాపురం రూరల్

కనువిందుగా..


రైతన్న ఆరుగాలం శ్రమించి సాగుచేసిన వరిపంట చేతికి రానుంది. ఖరీఫ్ సీజన్‌లో కవిటి ఉద్దానం బీల ప్రాంతంలో సాగుచేసిన వరిపైరు అందాలు కనువిందు చేస్తున్నాయి. పంట చేతికందే దశలో పచ్చని బంగారం రంగులో కంటికి ఇంపుగా కనిపిస్తున్నాయి. ప్రకృతి సహకరిస్తే కొద్దిరోజుల్లో కోతలు పూర్తిచేస్తామని రైతులు చెబుతున్నారు.

- కవిటి

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ మందస శాఖ ఆధ్వర్యంలో మేధాసమ్మాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒడియా ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కొద్ది రోజుల్లో ముఖ్యమంత్రి జిల్లాకు రానున్నారని.. ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వస్తే అతనితో మాట్లాడించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. బారువలో ఒడియా మీడియం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని..ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యపై ముఖ్యమంత్రికి ప్రత్యేక దృష్టి ఉందన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. ఒడియా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. సీఎం జగన్ దృష్టికి ఒడియా ఉపాధ్యాయుల సమస్యలను తీసుకెళ్తానన్నారు. పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని అభినందించడం మంచి పరిణామమన్నారు. ఎమ్మెల్యే బి.అశోక్ మాట్లాడుతూ.. జీవో నంబరు 117 రద్దుకు కృషిచేస్తామన్నారు. ఒడియా మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని సంఘ ప్రతినిధులు ప్రజాప్రతినిధులను కోరారు. 2022లో జరిగిన ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మిట్టు మహా పాత్రోకు బహుమతులు అందజేసి అభినందించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఐదు, పది తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ విజయ, కేంద్ర మాజీ మంత్రి కృపారాణి


అయూషి నృత్య ప్రదర్శన

అలరించిన చిన్నారి నృత్యప్రదర్శన

కార్యక్రమంలో భాగంగా కంచిలి మండలానికి ఆయూషి మహంతి నృత్యప్రదర్శన ఆహూతులను అలరించింది. ఆమెను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ నగిరి ప్రభావతి, జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వర్, యూఎస్‌వోఎంఏ ప్రెసిడెంట్ సత్యన్నారాయణ పాడి, డీసీఈబీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, ఉత్కళ సమ్మేళన్ ప్రతినిధులు అద్వైత కుమార్ మహాపాత్రో, భీమసేన్ మహాపాత్రో, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దొలాయి, సంఘ ప్రతినిధులు నల్ల గోవిందరాజులు, గణపతి సాహు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే లోకనాథంనాయుడు దంపతుల విగ్రహావిష్కరణ


లోకనాథంనాయుడు, అన్నపూర్ణమ్మ దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన దృశ్యం

టెక్కలి: టెక్కలి నియోజకవర్గం అభివృద్ధిలో మాజీ ఎమ్మెల్యే సత్తారు లోకనాథంనాయుడు పాత్ర కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. లోకనాథం నాయుడు, అన్నపూర్ణమ్మ దంపతుల విగ్రహాలను స్థానిక సుదర్శన్ థియేటర్ ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. విశాఖకు చెందిన క్రాంతి పిక్చర్స్ అధినేత నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, విశాఖ డెయిరీ మేనేజర్ చాపరా విజయరావు ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధికి లోకనాథంనాయుడు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల అధినేత బీవీఎస్‌ఎన్ మూర్తి, కుటుంబ సభ్యులు వెంకటరమణ, సుధారాణి, టి.కిరణ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, నాయకులు చింతాడ గణపతి, పొన్నాన జనకమోహన్‌రావు, సీహెచ్ పార్వతీశం, సత్తారు ఉషారాణి, డి.రంగబాబు, డి.ధర్మారావు, టి.ఎస్.ఎన్.రమణ, గురివినాయుడు, ఎస్.బాలకృష్ణ, ఎం.రాధాకృష్ణ, సోమేశ్వరరావు, యర్రన్నాయుడు, కుశుడు, గంతాయత్, బి.రాజేష్, రంగా, రవి, వి.నారాయణ, ఎస్.బాలకృష్ణ, రామకృష్ణ, వెంకటేష్,బి.శ్రీను, మురళి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు సొండిపూడి విద్యార్థిని


శ్రీజను అభినందిస్తున్న దృశ్యం

మందస: సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాడ శ్రీజ జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక య్యింది. సిక్కోలు గణిత వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో విజేతగా నిలిచిన శ్రీజ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఆదివారం ఆమెను మ్యాథ్స్ టీచర్ ఎస్.నారాయణరావుతో పాటు స్థానికులు అభినందించారు.

ఉత్సాహంగా భగవద్గీత శ్లోక పఠన పోటీలు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

టెక్కలి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సాయికృష్ణా యోగా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకటి నుంచి డిగ్రీ స్థాయి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో పలువురు ప్రతిభను కనబర్చారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో డి.వర్షిణి, ఎల్.తనూజా, పి.వర్షిత, కె.సహస్రనారాయణ, పి.శృతి, బి.ఊహ, వి.హారిక, ఎస్.స్నేహితారెడ్డి, పి.లిఖిత, నైమిషగాయత్రీ, ఎస్.శశాంక్, సిహెచ్.ఇందు, బి.భారతి, వి.విమల, ఎస్.సహేళి, జి.సాయిచరణ్, ఎం.పావనీరాణి విజేతలుగా నిలిచారు. వీరికి ఈ నెల 23వ తేదీన గీతా జయంతి సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బి.అయ్యబాబు, చంద్రశేఖర్‌పట్నాయక్, ఎం.సింహాచలం, ఎం.తాతయ్య, డి.ఎ.స్టాలిన్, కె.వేణుగోపాల్, బి.అన్నపూర్ణమ్మ, టి.పావనీరాణి, కె.కామేశ్వరరావు, డి.వీరాస్వామి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

కాలువల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: నీలంపేట పంచాయతీ గుంటజగన్నాథపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో చేపట్టనున్న కాలువల నిర్మాణానికి ఆదివారం భూమి చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు చెంచులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసరి శిమ్మయ్య, జేసీఎస్ కన్వీనర్లు ఎస్.రాయణరావు, మెట్టు వాసు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి అయోధ్య అక్షింతలు


మాట్లాడుతున్న రాంప్రసాద్ మాస్టార్

ఇచ్ఛాపురం: మండలం, మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి అయోధ్యలోని శ్రీరామాలయంలో శ్రీరామునికి పూజించిన పుణ్య అక్షింతలను జనవరి నెల 15వ తేదీకల్లా అందించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ స్థానిక అధ్యక్షుడు పాక తులసీదాస్ అన్నారు. ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ, మండల పరిధిలోని ప్రతినిధులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పాక తులసీదాస్, కార్యవర్గ సభ్యులుగా రాంప్రసాద్ మాస్టారు, ఆర్.జయకృష్ణ, సత్యం, లోకేష్, రంగా, శ్రీను, దుర్యోధనరెడ్డి ఎన్నికయ్యారు.


మానవ హక్కులపై అవగాహన అవసరం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం:

మానవ హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్య అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినికేతన్ పాఠశాలలో మానవహక్కుల కమిషన్ అధ్యక్షుడు డి.కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎం.రాజేంద్ర, ఎం.రాంబాబు, కె.రామారావు, కేసి పూరి, తులసీదాస్ ఉన్నారు.

మనోజ్‌కి జానపద రత్న అవార్డు ప్రదానం


సత్కారం పొందుతున్న మనోజ్

కాశీబుగ్గ: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ, విశాఖరత్న కళాపరిషత్ 25వ వార్షికోత్సవం విశాఖలోని జిల్లా పౌరగ్రంథాలయం ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలాస మండలానికి చెందిన బ్లడ్ డోనేషన్ మోటివేటర్, జానపద కళాకారుడు మనోజ్‌కి జానపద రత్న అవార్డును నిర్వాహకులు ప్రదానం చేశారు. మనోజ్‌కి అవార్డు రావడంపై జానపద పరిశోధకులు బద్రి కుర్మారావు సినీనటుడు కుమార్ నాయక్, లింగిలింగిడి పాట ఫేమ్ రఘు, ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్, ఏఎస్పీ శ్రీనాథ్, సీఐ కామేశ్వరరావు, డాక్టర్ జీవితేశ్వరరావు, డాక్టర్ కూనమోహన్‌బాబు, డాక్టర్ మేఘన, అప్పారావు, జానపద కళాకారులు అభినందనలు తెలియజేశారు.

లింగవివక్ష తగదు

కంచిలి: లింగవివక్షతను నిర్మూలించాలని చిన్నకొజ్జిరియా సర్పంచ్ గొనప సీతారాం అన్నారు. గ్రామంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌కేపీ ఏపీఎం పి.ఉమారాణి, సీసీ పాపారావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

- పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు


కాశీబుగ్గ: మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు


పలాస: నీలావతిలో మాట్లాడుతున్న పైల చిట్టిబాబు


మందస: హన్నాళిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 14వ తేదీన పలాసలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కోరారు. పురపాలక సంఘం ఆవరణలో మెప్మా సీవోలు, ఆర్పీలు, సీఎల్‌ఆర్పీలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున మహిళా సంఘాల సభ్యులు తరలిరావాలన్నారు. స్థానిక రైల్వే గ్రౌండ్ వద్ద సభ ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

పలాస: సీఎం జగన్ పర్యటనను ఉద్దానం ప్రాంత ప్రజలు విజయవంతం చేయాలని పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు కోరారు. ఈ మేరకు ఉద్దానం ప్రాంతంలోని గురుదాసుపురం, నీలావతి, మాకన్నపల్లి, బొడ్డపాడు గ్రామాల్లో ఆదివారం సమావేశాలు నిర్వహించి సీఎం పర్యటన వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వాడ రవి, సార్ర తిరుపతిరావు, సైని దేశయ్య, బమ్మిడి దుర్యోధన, మద్దిల పాపారావు, తామాడ మదన్ ఉన్నారు.

మందస: ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకీరావురెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్‌పాణిగ్రాహి కోరారు. హన్నాళి, బెల్లుపటియా, సిరిపురం, పింపిడియా గ్రామాల్లో పర్యటించి, సీఎం జగన్ పలాసలో నిర్వహించే సభకు తరలిరావాలని కోరారు. పార్టీ నాయకులు త్రినాథ్‌చౌదరి, శివశంకర్‌మల్లికో పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంచిలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. బూరగాం గ్రామ సచివాలయం ఆవరణలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో కేంద్రం అమలు చేస్తున్న పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ సల్మాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వికసిత్ భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బీన వంశీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత మద్దు వెంకటరావు, టీడీపీ నాయకుడు అప్పారావు, వైఎస్సార్‌కేపీ ఏపీఎం పి.ఉమారాణి పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్‌స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న 76వ జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో రెండో రోజైన ఆదివారం పలు క్రీడా పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతోందన్నారు. విజేతలకు దేవదాస్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమష్టిగా పయనిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న వైస్సార్‌సీపీ నాయకుడు జోగారావు

సోంపేట: శ్రీశయన కుల సంఘ ప్రతినిధులంతా సమష్టిగా పయనించి కులాభివృద్ధికి కృషిచేద్దామని పలువురు వక్తలు అన్నారు. సోంపేట పట్టణ శ్రీశయన సంక్షేమ కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. సంఘంలో పేదవారికి ఆర్థిక చేయూతనివ్వడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారన్నారు. సంఘప్రతినిధులు రాజకీయంగా, విద్య, ఆర్థిక పరంగా అభివృద్ధి సాధించడానికి కృషిచేద్దాం అన్నారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘ కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, సోంపేట జెడ్పీటీసీ సభ్యుడు తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, శ్రీశయన సంఘ అధ్యక్షుడు లోడ అప్పారావు, రెల్ల జయరాం, గేదల భీమారావు, సోంపేట పట్టణ శ్రీశయన సంక్షేమకుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

తీరంలో మెరైన్ పోలీసుల గస్తీ


సోంపేట: బారువ తీరంలో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

సోంపేట: కార్తీక ఆదివారం సందర్భంగా బారువ మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీరప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా మెరైన్ సీఐ డి.వి.జె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు నిర్వహించారు. బారువ, పుక్కళపాలెం, రట్టీ బీచ్ ప్రాంతాల్లో ఎస్సైలు కె.శిరీష, ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. సముద్ర స్నానాలు ఆచరించేటప్పుడు పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com